నోరు ఆదరింపగా-నొసలు వెక్కిరించినట్లుంది ఈ ఉత్తరువుల అసంబద్ధ నిర్ణయాలు కొందరినీ గట్టుకు, కొందరి నాగట్టుకు తోసీ—కొందరిని నట్టేట ముంచుతున్నాయి.

ఇంతకన్న యీ బళ్లను, కల్లంగళ్లతో పాటు మూసివేయిస్తే యెంతో బాగుండేది లేదా, కనీసం దేశభాషలను బోధించడమైనా తీసివేసేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా బాగుండిపోను!

ఎమ్. ఎల్. ఏ. లతో చెప్పుకోవాలంటే తమకు లభించే నెలసరి వేతనాలతో ఏ పెద్ద పెద్ద హోటళ్లలోనో కాలంగడిపే వీరిని కనుక్కోడ మెలాగ? మంత్రిగా రన్యభాషీయులు- మన పండితులగోడు వారి చెవి కెక్కదు ఇక...స్వతంత్రమార్గాన్ని పోయే పత్రికలే శరణ్యంగా కనిపిస్తాయి. ఈ ఆలోచించడాలు, అర్థంలేని ఉత్తరువులూ, ఫలితంలేని ప్రకటనలూ అంతమయే శుభదిన మెప్పుడో!

# స్వతంత్ర భారతం!

శొంఠి కృష్ణమూర్తి

'పత్రిక'కోసం ఏదన్నా రాయాలని తాపత్రయం !

ఎందుకోగాని పత్రికా ప్రపంచానికి జీవితాన్ని అంకితంచేసి, దాంట్లో వాళ్ళ జీవితాని కర్థం గ్రహించాలని తాపత్రయపడే జర్నలిస్టుల పత్రికలంటే అమితమైన గౌరవం నాకు! అందుకే 'పత్రి'కకి ఏదన్నా రాయాలని తాపత్రయం! (కాని సాధారణంగా ఆ పత్రికలు కూడా లెక్కన వ్యాపారస్థుల పత్రికల్లానే ఆశాభంగం కలిగిస్తూంటాయి— తరుచు).

కాఫీతోగాని హుషారు రాదని బజారుకు బయల్దేరాను.

ఆదివారమన్నట్టు మరిచిపోయి 'నెహ్రూ' కేఫ్‌లో కాలుపెట్టి వెనక్కి తిరిగాను. 'ఆంధ్ర రత్న' భవనంగాని, 'ఆంధ్రకేసరి' విలాస్‌గాని చాలా దూరమవడంవల్ల, దగ్గరగా ఉన్న 'జిన్నా' టీ స్టాలులో దూరి టీ సేవిస్తున్నాను.

అంతవరకూ నా పక్కనే కూచున్నప్పటికీ, నాచేత గుర్తింపబడకపోడానికి విచారిస్తూ, నిట్టూరుస్తున్న 'జైహింద్' టాకీసు యజమాని నాదృష్టి నాకర్షించాడు.

“కొత్తగా మీరు తెప్పించిన ఫిల్ము పేరేమిటి?”

“వందేమాతరం” అండీ !

అల్లాగే ఏదో సంభాషణ కానిచ్చి బయటపడ్డాను. అక్కడే వున్న 'గాంధీ' కిళ్లీషాప్ కనిపిస్తే అటు వెళ్లాను.

“ఒక కిళ్లీ యియ్యవోయ్!” అన్నాను.

“అరే! ఇప్పుడే తమలపాకులైపోయాయండీ” అని 'పోనీలే' అని వెళ్లిపోదామనుకొని వెనుతిరిగిన నాకాలు ఒక్కడుగన్నా ముందుకు పడకుండా ఇల్లా ఏకరువు పెట్టసాగాడు. “కిళ్లీ లేదుగాని, 'నేతాజీ' బీడీలు, 'నేషనల్' గోల్డుఫ్లేక్ సిగరెట్టులూ, 'జయప్రకాష్' చెక్కపొడీ, 'షణ్ముఖం చెట్టి' ముక్కపొడీ- ఇంకేవి కావాల్సినా ఉన్నాయండి” అన్నాడు.

వాడి గొంతుక నొప్పన్నా పెట్టనందుకు సంతోషిస్తూ, ఒక చెక్కపొడి పొట్లం తీసుకుని ఇంటిముఖం పట్టాను.

కాంగ్రెసులో చేసిన త్యాగాలవల్ల ఇంకేమీ లాభంలేకపోగా, నిరాశచెంది, ప్రకాశంగారి ప్రధానిత్వపు రోజుల్లో ఒక ఖద్దరు బట్టలషాపు తెరిచి 'ప్రకాశం ఖద్దరుస్టోర్సు' అని పేరుపెట్టిన నా స్నేహితుడు 'గాంధీ'రావు తన కొట్టులోకి తీసుకువెళ్లేడు.

జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నా, ఎన్ని కష్టాలొచ్చినా భయపడకండా ఎల్లాగో అల్లా బతికే

ఆశావాదతను! అతనిలోని ఆ గొప్పతనమే నన్ను ఆకర్షించేది.

లోపల కొత్తరకం కుర్చీలున్నాయి.

"చాలా బాగున్నాయ్! ఎక్కడివి?" అన్నాను.

"మనరామంగాడి 'పటేల్' ఫర్నిషింగ్ హౌస్ లేదూ. అక్కడ తీసుకున్నాను."

"మరి, పాతవి?"

"అవి మేం కొత్తగా తెరుస్తున్న 'రాజేంద్ర ప్రసాద్' రెడీమేడ్ డ్రెస్ పేలెస్‌కి యిచ్చాను."

ఇంకో అరగంట అక్కడ కాలక్షేప మయింది. దారిలో ఎవడో కుర్రాడు, యింటికి తిరిగి వొస్తుంటే అడ్డుపడి 'కాళేశ్వర్రావు' మార్కెట్‌లో తన పర్సు పోయిందనీ, తన సవితితల్లి 'స్వరాజ్య' లక్ష్మి తిడుతుందనీ వెనకాలపడ్డాడు. ఓ పావలా యిచ్చి వాణ్ణి వొదిలించుకున్నాను.

చివరికి 'పత్రి'కకి రాద్దామనుకుని టేబిల్ ముందు కూచున్నాను. 'అజాద్' కలం తీసి విదిపితే సిరాలేదు. 'సుభాష్' సిరాకంపెనీ వాళ్ల సిరా తీసి పోశాను. తెల్లకాగితా లైపోతే 'ఆంధ్రా' పేపరుమిల్సువారి 'బ్రౌను' కాగితాలు తీశాను.

అంతసేపు ఏదో రాద్దామనే తీవ్రమైన కోరిక వుందన్నమాటేగాని ఏం రాయాలో ఆలోచించుకోలేదు.

సాధారణంగా ఫలానాది రాయాలని తీవ్రమైన వాంఛ వుంటేగాని కలం పట్టను. కలం పట్టాక ఆలోచించడంనాకు చేతకానిపనుల్లోఒకటి.

ఈవేళిది కొత్తవటంవల్ల ఆలోచించసాగాను, ఏం రాద్దామని. అసలు రాయవల్సింది తప్ప తక్కిన ఆలోచనలన్నీ తోస్తున్నాయి.

ఒకపత్రికవాళ్లుకొత్తరోజుల్లో'కమ్యూనిస్టు తెలుగు దినపత్రిక' అని ప్రకటించి, తర్వాత 'తెలుగు' అనడము మానేశారు. అలాగే ఆలిండియా రేడియో వారు 'ఆలిండియా రేడియో— తెలుగులోవార్తలు' అని వార్తా ప్రసరణం కావించేవారు— ఇప్పుడు "వార్తలు" అని మాత్రమే అంటున్నారు.

ఈ రోజుల్లో అన్నీ రాజకీయ పదాలు తగిలించడం పాషన్‌కదూ-అందుకనే, 'జైహింద్' 'వందేమాతరం' అనే పేర్లతో పత్రికలొస్తున్నాయి.

అసలు దీని పునాది వేరేవుంది. అది ఫిలిం ప్రపంచంలో పుట్టిన వెర్రితలలతో మొదలైంది. ఎందుకంటే 'కన్నన్' టీ అండ్ కాఫీ, 'కృష్ణవేణి'సిరా, 'కాంచన్' స్నో, 'మాలపిల్ల' చీర, 'రైతుబిడ్డ' రవికలగుడ్డ అని మొదలైంది వర్తకం-కాని-సినిమారంగంనించి ఈ జబ్బు (చివరికి ఇదొక జబ్బేమోననే అనుమానం కలిగింది-ఆలోచించగా) రాజకీయరంగంలోకి వొచ్చి, ప్రతి కాఫీహోటలు పేరు మొదలూ, ప్రతి సిగరెట్టు, బీడీలమీదా, ప్రతి క్షౌరశాలమీదా దేశనాయకులే, గౌరవమైన జాతీయపదాలే సాక్షాత్కరించడం జరిగింది.

ఏమిటి ఈ షాహుకార్ల ఉద్దేశం? ప్రజల కళ్లల్లో దుమ్ముకొట్టాలనా? దేశనాయకుల పేర్ల మీది గౌరవంతోవాళ్ళ అసలువిలువ గ్రహించలేని మూర్ఖులు, ఈ ప్రజలంతా అనా? ఎన్నాళ్లీ ఈ దారుణం?

కొన్ని ఇన్‌స్టిట్యూషన్స్‌కి నాయకుల పేర్లు పెడితే, జాతీయపత్రికలకి జాతీయోద్రేకాన్నిచ్చే పేర్లుపెడితే కొంత అర్థముంది.

"కనకశెట్టి గాంధీజీమరణించిన రెండురోజులకే 'మహాత్మాజీకేఫ్' హోటలు పెద్ద ప్రచారంతో తెరిచాడు. గాంధీమీది భక్తికొలదీ ప్రజలు...... ...చివరికి ప్రజలు ఆపేరువల్ల మోసగించబడడం గుర్తించి, శెట్టిచే బలవంతంగా పేరుమార్పించి, గాంధీజీగౌరవం నిలిపారు."

'పత్రిక'కోసం రాయసాగాను!

"మనకి ముందు ఎంతమందో జీవయాత్ర సాగించడమేకాదు, ముగించుకు వెళ్లారు కూడా దానివల్ల మనకి కలిగిన అపారమైన మేలుముందర, మనం తిరిగి మరణరూపంగా చెల్లింపవలసినమూల్యం చాలా తక్కువ. ముసలివగ్గులు కాలధర్మం చెందడమంటూ లేకపోతే, మనం ముందుకు సాగడమే ఉండకపోను. మనుష్యుడెవరూ ఉట్టికట్టుక ఊరేగరాదన్న ఏర్పాటే మన నాగరకత అంతటికీ మూలకందం."—శామ్యూల్ బట్లర్.